## కిషన్‌నాయక్ సేవలు స్ఫూర్తిదాయకం

**మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్**



కిషన్‌నాయక్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్, ప్రజాసంఘాల నాయకులు

మహబూబాబాద్ రూరల్, జూలై 14: బడుగు, బలహీన వర్గాలకు గుగులోత్ కిషన్‌నాయక్ చేసిన సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ అన్నారు. జమాండ్లపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయుడు కిషన్‌నాయక్ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆదివారం పట్టణంలోని ఏబీ ఫంక్షన్ హాల్‌లో దళిత, గిరిజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 40 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ అనేక మంది నిరుపేద విద్యార్థులకు నోట్‌బుక్స్, దుస్తులు, స్టడీ మెటీరియల్ అందించారన్నారు. వృద్ధులు, అనాథ పిల్లలకు నిత్యావసర సరుకులు, భోజన సదుపాయం కల్పించడంతో పాటు వారికి అండగా ఉన్నారన్నా రు. దళిత, గిరిజన సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ వారి అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. కిషన్‌నాయక్ సేవలను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, సీపీఐ (ఎంఎల్) నాయకులు చంద్రన్న, భద్రునాయక్, ఉపాధ్యాయ, దళిత, గిరిజ న ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

**ఉద్యానశాఖ అధికారి రాకేశ్**



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ డివిజన్ అధికారి రాకేశ్

తొర్రూరు, జూలై 14: దేశంలో ప్రజల అవసరాలకు తగినట్టు నూనె ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నాయని డివిజన్ ఉద్యానశాఖ అధికారి రాకేశ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యాచరణలో భాగంగా ఆదివారం హరిపిరాల గ్రామంలో తక్కళ్లపల్లి శ్రీపాల్ రావు వ్యవసాయ క్షేత్రంలో మొక్కలు నాటిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 14 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం సెప్టెంబర్ 30 వరకు కొనసాగుతుందన్నారు. ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచాలని ప్రభుత్వాలు రైతులకు రాయితీ ఇస్తూ తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలో 7,100 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ సాగవుతున్నదని, 300 ఎకరాలకు పైబడి మొక్కల నుంచి పంట దిగుబడి ప్రారంభమై రైతులు ఆదాయం పొందుతున్నారని వివరించారు. రాయితీలను సద్వినియోగం చేసుకునేలా గ్రామస్థాయి నుంచి ఉత్సాహం ఉన్న రైతులను ప్రజాప్రతినిధులు ప్రోత్సహిస్తే ఉద్యానశాఖ, ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించి సాగుకు కావాల్సిన మెలకువలు, సందేహాల నివృత్తితో మార్కెటింగ్ విషయంలో పూర్తిస్థాయి సహకారం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్స్ వెంకన్న, అవినాశ్, అనిల్, రైతులు సుంచు సంతోష్, చెవిటి సధాకర్, చిత్తలూరి శ్రీనివాస్, లింగన్న పాల్గొన్నారు.

## నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు

**ఎంపీ పోరిక బలరాంనాయక్**

మహబూబాబాద్ రూరల్, జూలై 14: రాష్ట్రంలోని నిరుపేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తామని ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌చంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ బలరాంనాయక్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను అమలుచేసే విధింగా ప్రభుత్వం ప్రణాళికా ప్రకారం పాలన అందిస్తుందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రైతులకు రైతు భరోసా అందించేంకు అభిప్రాయ సేకరణ చేపట్టినట్లు తెలిపారు. కార్యకర్తలు అధైర్యపడొద్దని, పార్టీకోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం పార్టీ జిల్లా నాయకులు ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రూనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న పార్టీ నాయకులు

## పట్టుదలతో లక్ష్యాలను సాధించవచ్చు



సమావేశంలో మాట్లాడుతున్న పారిశ్రామిక వేత్త రాంబాబు

మహబూబాబాద్ రూరల్, జూలై 14: పాఠశాల దశ నుంచే విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని ప్రముఖ పారిశ్రామికవేత్త లింగంపల్లి రాంబాబు అన్నారు. ఆదివారం పట్టణంలోని గంగపుత్ర భవనంలో నోఫా (నాయీ బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో జిల్లాలో పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలను అందజేశారు. కార్యక్రమానికి రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరూ కష్టపడి ఉన్నత చదువులు చదవాలని, చదువుతోనే సంఘంలో మంచి విలువలు, ప్రాముఖ్యత ఉంటుందన్నారు. అనంతరం పదేళ్లుగా విద్యార్థులకు నోఫా ఆధ్వర్యంలో ప్రతిభా అవార్డులు అందిస్తూ, వారి తల్లిదండ్రులనూ సైతం సన్మానించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో నోఫా బాధ్యులు సూర్యనారాయణ, రాపోలు సుదర్శన్, గజ్జల వెంకన్న, శ్రీనివాస్, మల్లయ్య, లింగంపల్లి దయానంద్, నారాయణ, జంపాల విశ్వ, వీరభద్రం పాల్గొన్నారు.

## 'దాశరథి జయంత్యుత్సవాలను అధికారికంగా నిర్వహించాలి'



నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

చిన్నగూడూరు, జూలై 14: దాశరథి కృష్ణమాచార్యుల శతజయంతి వేడుకలను ఈ నెల 22న అధికారికంగా నిర్వహించాలని చిన్నగూడూరు గ్రామస్తులు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. నిజాం నిరంకుశ పాలనపై ధిక్కారస్వరం వినిపించిన కృష్ణమాచార్యుల జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా దాశరథి స్వగ్రామం చిన్నగూడూరులో నిర్వహించాలని వినతి పత్రంలో కోరినట్లు గ్రామస్తులు గాడిపల్లి జీవన్, జినక శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నగూడూరు మండల కేంద్రానికి దాశరథి పేరు పెట్టాలని, హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై దాశరథి సోదరుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నామని తెలిపారు. కార్యక్రమంలో శాగంటి రమేశ్ ఉన్నారు.

## గిరిజన బిడ్డలకు సౌకర్యాలు అందాల్సిందే

**జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌నాయక్**



సీతానగరంలో ఆరుబయట కూర్చొని భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న హుస్సేన్‌నాయక్

గూడూరు, జూలై 14: ప్రభుత్వ రంగ సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న గిరిజన బిడ్డలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని వసతులు అందించాల్సిందేనని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల పాఠశాల, సీతానగరంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత రెండు పాఠశాలల్లోని తరగతి గదులు, వంటశాల, పరిసరాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా? అడిగి తెలుసుకున్నారు. వి ద్యార్థులకు రుచికరమైన ఆహారం అందించాలని, వంట గదులు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. సీతానగరం పాఠశాలలో విద్యార్థులు తాము ఆరుబయట నేలపై కూర్చొని ఆహారం తింటున్నామని, 400 మంది విద్యార్థులకు మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉన్నదని హుస్సేన్ నాయక్‌కు తెలిపారు. వెంటనే ఆయన ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్ సర్వేశ్వర్‌రెడ్డికి ఫోన్ చేసి గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వసతులు సరిగాలేవని, వెంటనే కావాల్సినన్ని మరుగుదొడ్లు, నీరు, భోజన గదులు ని ర్మించాలన్నారు. అధికారులతో కలిసి ఎస్టిమేషన్ వేసి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ ఎర్రయ్య, ఏసీఎం వో వీరూలాల్, హెచ్‌ఎం గంగూనాయక్, మాజీ జడ్పీటీసీ నాయిని ధర్మారెడ్డి, మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న, నాయకులు మోతీలాల్, రాంబాబు, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

## 'ఆయిల్‌పామ్ తోటను ధ్వంసం చేసిన వారిపై చర్య తీసుకోవాలి'

కేసముద్రం, జూలై 14: మండలంలోని ఉప్పరపల్లి, కాట్రపల్లి గ్రామాల మధ్యలో ఉన్న తన భూమిలో ప్రభుత్వ ప్రోత్సాహంతో వేసిన ఆయిల్‌పామ్ తోటను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు తమ్మడబోయిన వీరభద్రయ్య అన్నారు. ఆదివారం ఆయన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి అనంతరం మాట్లాడారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆయిల్‌పామ్ తోటను ధ్వంసం చేశారని, దీంతో రూ.80 వేల నష్టం జరిగిందని, చట్టపరమైన చర్యలు తీసుకొని న్యాయం చేయాలని వీరభద్రయ్య కోరాడు.

## వైద్య కళాశాలకు అనాథ శవం అప్పగింత


మహబూబాబాద్ రూరల్, జూలై 14: మండలంలోని సికింద్రాబాద్ తండాలో ఉన్న ఆదరణ అనాథ వృద్ధ ఆశ్రమంలో మురుగన్ (45) అనే వృద్ధుడు ఆదివారం మృతి చెందాడు. అతడి శవాన్ని తెలంగాణ నేత్ర అవయవ, శరీర దాతల సంఘం జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కళాశాలకు అప్పగించినట్లు ఆశ్రమ నిర్వాహకుడు లోకేశ్‌కుమార్ తెలిపాడు. మృతుడు డోర్నకల్ రైల్వేస్టేషన్‌లో ఉండి భిక్షాటన చేస్తుండగా పోలీసుల సమాచారంతో రెండేళ్ల క్రితం అనాథ ఆశ్రమానికి తీసుకొచ్చారన్నారు. దీంతో ఆశ్రమ నిర్వాహకులు లోకేశ్‌కుమార్, పార్వతిని రవీందర్‌రెడ్డి అభినందించారు.

## జనరల్ బోగీల పెంపు అభినందనీయం

మహబూబాబాద్ రూరల్, జూలై 14: రైళ్లలో జనరల్ బోగీల పెంపు నిర్ణయం అభినందనీయమని జనరల్ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు నెలల నుంచి దేశవ్యాప్తంగా ప్రధానమంత్రికి జనరల్ బోగీలు పెంచాలనే ఆకాంక్షతో కోటి ఉత్తరాల కార్యక్రమం ప్రవేశపెట్టామని, అన్ని రాష్ట్రాల నుంచి ప్రజలు సుమారుగా 20లక్షల ఉత్తరాలు రాసి పంపించారన్నారు. అన్ని రైల్వే డివిజన్ల నుంచి ఈ ప్రకటన కార్య రూపం దాల్చేవరకు ఉత్తరాల ఉద్యమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

## మత్తడికి చేరువలో పెద్దచెరువు

- 16 అగుడుగులకు చేరిన నీటి మట్టం
- జలకళ తో ఉట్టిపడుతున్న చెరువు



జలకళను సంతరించుకున్న బయ్యారం పెద్దచెరువు

బయ్యారం, జూలై 14: మండల కేంద్రంలోని పెద్దచెరువు మత్తడికి చేరువలో ఉన్నది. కొన్ని రోజులుగా భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల సరిహద్దు ఇల్లెందు, గంగారం, కొత్తగూడ గ్రామాల్లో కురుస్తున్న వర్షాల వల్ల పందిపంపుల వాగు, మసివాగు ప్రవహిస్తుండడంతో వరద పెద్ద చెరువులోకి చేరుతున్నది. దీంతో చెరువు గరిష్ట నీటి మట్టం 16.2 అగుడులు కాగా, ప్రస్తుతం 16 అడుగులకు చేరుకున్నది. చెరువులోకి పుష్కలంగా నీరు చేరడంతో రైతులు సంతోషంగా పంటలను సాగు చేస్తున్నారు. చెరువు అలుగు ద్వారా ప్రవహించిన నీరు గార్ల మండలం సీతంపేట పెద్ద చెరువుకు చేరడంతో అక్కడి చెరువు అలుగు పడుతున్నది. గార్ల, బయ్యారం మండలాల్లోని సుమారు 15వేల ఎకరాలకు సాగునీటికి పెద్దచెరువే ఆధారం కానుండడంతో రెండు మండలాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బేతోలులో సవార్ల సందడి



పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు

మహబూబాబాద్ రూరల్, జూలై 14: మండలంలోని బేతోలు గ్రామంలో ఆదివారం సవార్ల సందడి నెలకొన్నది. మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పీరీల కొట్టం ద్వారా హుస్సేన్ హుసేన్ పగటి సవార్ల కొలువు దీరగా పెద్ద ఎత్తున భక్తులు సవార్లకు పూలు, ఊదు రంగుల దట్టీలు కుడకలు, బెల్లం కట్టారు. గ్రామంలో పీరీలను ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు షేక్ యూసుఫ్, మస్తాన్, మదార్, లతీఫ్, షేక్ ఖాదర్ బాబా, జావిద్, షరీఫ్, సత్తార్, యాకూబ్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

## చినుకు పడితే చిత్తడే..

**వీధుల్లో మురుగు నీటితో ప్రజలు అవస్థలు**



చిన్నగూడూరులో రోడ్డుపై నిలిచిన మురుగు నీటిని చూపుతున్న మహిళ

చిన్నగూడూరు, జూలై 14: మండల కేంద్రంలోని వీధులు చినుకు పడితే చిత్తడిగా మారుతున్నాయి. మురుగు నీటి నిల్వలతో ఆయా కాలనీ వాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల పలు వీధులు బురదమయంగా మారాయి. బస్టాండ్ సెంటర్ నుంచి గ్రామ పంచాయతీకి వెళ్లే రహదారి పూర్తిగా అధ్వానంగా మారింది. ఇండ్ల ఎదుట మురుగు నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోందని, దీంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది పిల్లలు, పెద్దలు విషజ్వరాల బారిన పడుతున్నాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

## ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

గూడూరు, జూలై 14 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఏర్పాటు చేసుకున్న అ'పూర్వ' సమ్మేళనంలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో నలపూరి వెంకన్న, భూక్యా సురేశ్, సంతోష్, హనుమ, నాగేంద్రబాబు, బాలాజీ, విజయ్, రెహమాన్, అరుణ, సంగీత, సరిత, సునీత, సారిక, 150 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కవిత

## 'ప్రభుత్వ దవాఖానలో వైద్య సిబ్బందిని నియమించాలి'

గార్ల, జూలై 14: ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సిబ్బందిని నియమించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని మంగపతిరావు భవన్ లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వారికి వైద్యపరీక్షలు చేసి మందులు అందించాలని, వైద్య సిబ్బందిని నియమించాని లేకపోతే నిరాహార దీక్షలు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో మల్లెల నాగమణి, రమ, లక్ష్మి, ఝాన్సీ పాల్గొన్నారు.

## అనాథలను ఆదుకోవాలి

**ఎన్ఆర్ఐ పేరెంట్స్, లయన్స్‌క్లబ్ బాధ్యులు**



పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు, లయన్స్‌క్లబ్ బాధ్యులు

మహబూబాబాద్, జూలై 14: అనాథలను ప్రతిఒక్కరూ ఆదుకోవాలని ఎన్ఆర్ఐ పేరెంట్స్ లయన్స్ సభ్యులు పర్కాల రవీందర్‌రెడ్డి, లక్ష్మి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని దైవకృప చిన్నపిల్లల అనాథ ఆశ్రమంలో రవీందర్‌రెడ్డి–లక్ష్మి దంపతుల కుమార్తె మర్రి ప్రియరాగారెడ్డి పుట్టినరోజు వేడుకలను ఎన్ఆర్ఐ పేరెంట్స్, లయన్స్ క్లబ్ బాధ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పుట్టినరోజు వేడుకలను అనాథ పిల్లల నడుమ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి, సభ్యులు అనుమాల వెంకటేశ్వర్లు, చాడా అశోక్‌రెడ్డి, చౌడవరపు సుధాకర్, మాలే కాశీనాథ్, పరకాల ఇంద్రనీల్‌రెడ్డి, గంగాధర్, రవికుమార్, హేమచందర్, అనాథాశ్రమ నిర్వాహకుడు బానోత్ లోకేశ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సెప్టిక్ ట్యాంక్ క్లీనర్**

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-318953

**TOURS & TRAVELS**



★ మహాదేవ టూర్స్: 6th నవంబర్–కార్తీక మాసంలో కాశీ+12 క్షేత్రాలు. Ac Bus 20 స్లీపర్+20 సిట్టింగ్ 15 రోజులు. చార్‌ధాం 20th, సెప్టెంబర్ 3rd Ac. సంప్రదించండి: 9676637578.
NT-339536

**PLOT FOR SALE**

★ వరంగల్ హైవేలోని ఆలేరు–కొలనుపాకలో ఓపెన్ ప్లాట్లు మరియు ఫార్మ్‌ల్యాండ్ ప్లాట్లు అమ్మబడును. సాగర్ హైవేలో ఇండస్ట్రియల్ ఏరియాగా అభివృద్ధి చెందుతున్న యాచారంనందు ఓపెన్ ప్లాట్లు కలవు. స్పాట్ రిజిస్ట్రేషన్ & క్లియర్ టైటిల్. Ph: 7989747927.
NT-325882

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

## ఒకరిపై కేసు నమోదు

గార్ల, జూలై 14: అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే ఇష్టం వచ్చినట్లు తిట్టిన వ్యక్తిపై గార్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకా రం.. మండల కేంద్రానికి చెందిన బోడ పార్వతి మూడేళ్ల క్రితం అంజనాపురం గ్రామానికి చెందిన గుగులో త్ మధుకు రూ.3లక్షలు అప్పుగా ఇచ్చింది. వాటిని తిరిగి ఇవ్వమని అ డిగితే ఇష్టం వచ్చినట్లు తిడుతున్నాడ ని, బాధితురాలి ఫిర్యాదు మేరకు కే సు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బయ్యారంలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయాలి

**సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి**

కేసముద్రం, జూలై 14: బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి, ఈ ప్రాంత యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించి సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ దేశ సంపదను సంపన్నులకు దోచి పెడుతోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కురవిలో ఈనెల 18న నిర్వహించనున్న జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నాయకులు చొప్పరి శేఖర్, మంద భాస్కర్, చంద్రయ్య ఉన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



బియ్యం అందిస్తున్న సమ్మయ్యగౌడ్

కేసముద్రం, జూలై 14: మండల కేంద్రంలోని జమలాపురం కాలనీకి చెందిన పొరండ్ల సునీత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం, 50 కిలోల బియ్యాన్ని ఆదివారం అందించారు. సునీత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎండీ ఆయూబ్‌ఖాన్, గండి వీరేందర్, కొండేటి కళాధర్, బానోత్ బాలూనాయక్, జల్లంపల్లి సుధాకర్, మిట్టగడుపుల జలేందర్, శ్రీకాంత్, మచ్చ వెంకటేశ్, భిక్షపతి ఉన్నారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతిచెందిన గేదె వద్ద మల్లయ్య

ఇనుగుర్తి, జూలై 14: విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని చిన్న నాగారం శివారులో ఆదివారం జరిగింది. బాధిత రైతు నాయిని మల్లయ్య కథనం ప్రకారం.. మల్లయ్య గేదె రోజువలే మేతకు వెళ్లి గ్రామ శివారులో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందిందని, గేదె విలువ రూ.80వేలు ఉంటుందని, నష్ట పరిహారం అందించాలని కోరాడు.

## విజృంభిస్తున్న విషజ్వరాలు

- కట్టుగూడెంలో 60 మందికి పైగా వైరల్ ఫీవర్
- జీపీల్లో నిధులు లేక గ్రామాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తం
- వ్యాధుల బారిన పడుతున్న ప్రజలు





జ్వరంతో బాధపడుతున్న చిన్నారి, వృద్ధురాలు

బయ్యారం, జూలై 14: మండలంలోని కట్టుగూడెంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. అనేక మంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో సుమారు 300 మంది జనాభా ఉండగా 60 మంది వరకు విషజ్వరాల బారిన పడ్డారు. జ్వరంతో పాటు తీవ్ర ఒళ్లు నొప్పులు, నీరసంగా మారడంతో చిన్నా పెద్ద తేడా లేకుండా జ్వరం వచ్చిన తర్వాత 10–15 రోజుల వరకు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది వచ్చి మందులు ఇచ్చినా తగ్గకపోవడంతో ప్రైవేట్ దవాఖానలను ఆశ్రయిస్తున్నామని, తద్వారా వేల రుపాయలు ఖర్చు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య పరీక్షల కోసం స్థానిక పీహెచ్‌సీకి వెళ్తే అక్కడ నమూనాలు సేకరించి జిల్లా కేంద్రంలోని టీ హబ్‌కు పంపడంతో రిపోర్ట్ వచ్చేందుకు మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతోందన్నారు. ఈ సమయభావంతో ఆందోళన చెందుతున్నామని, మరికొందరు ప్రైవేట్ ల్యాబ్‌లకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీపీలకు నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామంలో నామమాత్రంగా పారిశుధ్య కార్యక్రమాలు సాగుతున్నాయని, దీంతో పారిశుధ్యం లోపించి నీటినిల్వలు ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది జ్వరాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

## పారిశుధ్యం అస్తవ్యస్తం

**ఇబ్బంది పడుతున్న ప్రజలు**

నర్సింహులపేట, జూలై 14: గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో పల్లెల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ఏ వీధిలో చూసినా చెత్త చెదారమే దర్శనమిస్తున్నది. చిన్న వర్షం పడితే రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి నెలకొన్నది. ఫలితంగా ఈగలు, దోమలు వ్యాప్తి చెంది ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పాతబావి వద్ద చెత్త పేరుకుపోయిందని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్సీ కాలనీలో ఇండ్ల మధ్య ఉన్న పాతబావి

## శతాధిక వృద్ధురాలి మృతి



సావిత్రమ్మ(ఫైల్)

తొర్రూరు, జూలై 14: మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కొల్లావజ్ఝల సావిత్రమ్మ(103) శనివారం రాత్రి అనారోగ్యంతో మరణించారు. సావిత్రమ్మకు ముగ్గురు కుమారులు సోమయ్య, రాధాకృష్ణమూర్తి, వెంకటేశ్వరశర్మ, కుమార్తె మాణిక్యమ్మ సంతానం. కోడళ్లు శర్మిష్ఠ, కమలమ్మ, సీత, అల్లుడు శ్రీనివాసరావు ఉన్నారు.

## అలరిస్తున్న భీమునిపాదం



భీమునిపాద జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

దట్టమైన అటవీలో తెల్లని మంచు పొరల్లాంటి మేఘాల మధ్యన సుందరంగా జాలువారుతూ పర్యాటకులను అలరిస్తున్నది భీమునిపాద జలపాతం.. ఆదివారం కుటుంబ సభ్యులు, స్నేహితులతో వచ్చిన పర్యాటకులు సందడి చేశారు. గత ప్రభుత్వంలో జలపాతం వద్ద రూ.56లక్షలతో వాచ్‌టవర్, రాక్ రోడ్, ఫెన్సింగ్, మెట్లు, స్నానాల గదులు ఏర్పాటు చేసి సందర్శకులకు ఫారెస్టు అధికారులు సౌకర్యాలు కల్పించారు. వాటిని వినియోగించకుంటూ ప్రకృతి సోయగం భీమునిపాద జలపాతాన్ని సంతోషాల మధ్య హాయిగా పర్యాటకులు గడుపుతున్నారు.

*-గూడూరు, జూలై14*